క్లుప్తంగా

గిరిజన హక్కుల కోసం ఐక్యంగా పోరడాలి

సీతంపేట: గిరిజన హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని దండకారణ్య విమోచన సమితి జాతీయ అధ్యక్షులు చండా ఏలియా అన్నారు. ఆదివారం సీతంపేట వచ్చిన ఆయన గిరిజన నాయకులతో కలిసి స్థానిక అడ్వంచర్ పార్కు నుంచి సామాజిక భవనం వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి దేశంలో ఆదివాసీ చట్టాలు పకడ్బందీగా అమలు జరగడం లేదన్నారు. పీసాచట్టం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం వచ్చినా సక్రమంగా అమలు కావడం లేదన్నారు. ఆదివాసీల శ్రమను కొంతమంది దోచుకుంటున్నారన్నారు. మణిపూర్‌లో దారుణాలు జరుగుతున్నా జాతీయ ఎస్టీ కమిషన్ ఏం చేస్తుందని ప్రశ్నించారు. ఐటీడీఏలు అవినీతిలో కూరుకుపోయాయని, వాటిని ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు సమరెడ్డి మాణిక్యం, జాన్‌బాబు, బిడ్డిక ఉమామహేశ్వరరావు, పాలక పురుషోత్తం, సవర కుమార్, పి.భూదేవి, రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాడంగిలో 'చదవడం మాకిష్టం'



పుస్తకాలు చదవడంలో నిమగ్నమైన విద్యార్థులు

బాడంగి: స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన పిల్లలతో కథలు, కవితలు, సూక్తుల పుస్తకాలు చదివించారు. మంచి మంచి పుస్తకాలు చదవడం ద్వారా అపారమైన జ్ఞానం పెంపొందించుకోవచ్చని పిండ్రంగివలస ప్రధానోపాధ్యాయుడు రవిబాబు తెలిపారు.

ఎరువుల పంపిణీ



రేగిడి: అంబకండిలో రైతులకు ఎరువులు అందజేస్తున్న మండల వ్యవసాయాధికారి మురళీకృష్ణ

రేగిడి: మండలంలోని ఉంగరాడ, అంబకండి రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు ఆదివారం ఎరువులు పంపిణీ చేశారు. ఖరీఫ్ సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అన్ని గ్రామ సచివాలయాల పరిధిలోని ఆర్‌బీకేల్లో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ తెలిపారు. అవసరమైనప్పుడు రైతులు తమకు దగ్గరలోని ఆర్‌బీకేల వద్దకు వెళ్లి, రాయితీపై ప్రభుత్వం అందిస్తున్న ఎరువులు, విత్తనాలను తీసుకోవాలని కోరారు.

చేనేత హస్తకళా మేళా ప్రారంభం



చేనేత హస్తకళా మేళాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: స్థానిక పట్టణంలోని శ్రీసూర్యదుర్గా కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళా మేళాను ఎమ్మెల్యే కంబాల జోగులు ఆదివారం ప్రారంభించారు. ఈ నెల 18వ తేదీ వరకు కొనసాగే ఈ మేళాలో లభ్యమయ్యే చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి, చేనేత కళాకారులు, వృత్తుల వారిని ప్రోత్సహించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, వంగర మండలం కన్వీనర్ కరణం సుదర్శనరావు, గ్రామీణ వీవర్స్ డెవలప్‌మెంట్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు పరిశీలన

వంగర: మండలంలోని మద్దివలస, తలగాం గ్రామాల్లో వీఏఏలు చేపడుతున్న ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను ఏఓ తట్టికోట కన్నబాబు ఆదివారం పరిశీలించారు. ప్రతీ రైతు తాము పండిస్తున్న పంటకు సంబంధించి, ఈ-క్రాప్ నమోదు చేసుకుంటే పంటల బీమా, విక్రయానికి వీలుగా ఉంటుందని ఆయన తెలిపారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు

రాజాం: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఆవరణలో పారిశుద్ధ్య పనులు ఆదివారం చేపట్టారు. ఇటీవల ఆస్పత్రిని సందర్శించిన ఎమ్మెల్యే కంబాల జోగులు అక్కడి ముళ్లపొదలను చూసి, వాటిని తొలగించాలని ఆదేశించారు. స్పందించిన మున్సిపల్ అధికారులు, ఆస్పత్రి సిబ్బంది ముళ్లపొదలు తొలగించి, ఆ ప్రాంతాన్ని చదును చేసి బాగుచేశారు.

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని శ్రీకళాభారతి మున్సిపల్ ఆడిటోరియం ప్రాంతంలో గ్రీన్ బెల్ట్ సొసైటీ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టి, అక్కడి పరిసరాలను పరిశుభ్రం చేశారు. ప్లాస్టిక్ వ్యతిరేక దినోత్సవంలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో అక్కడి చెత్తాచెదారంతో పాటు వాడిపడేసిన ప్లాస్టిక్ బాటిళ్లు, సంచులను ఏరివేసి, డంపింగ్ యార్డుకు తరలించారు. అంతకుముందు ర్యాలీ నిర్వహించి, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. గ్రీన్‌బెల్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎస్వీ రమణమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు తక్షణ పరిష్కారం

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్:

తాగునీటి కొరత సమస్యకు తక్షణ పరిష్కారం దిశగా చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. ఈ మేరకు మండలంలోని నర్సిపురం గ్రామంలో తాగునీటి సమస్యకు పరిష్కారం దిశగా చర్యలు చేపట్టిన ఎమ్మెల్యే రూ.40 లక్షలు గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో సుమారు 3,500 మీటర్లు పైపులైన్ వేయించి గ్రామంలో గల ప్రధాన వీధి, చిన్నవీధి, మొండి వీధి, కుమ్మరి వీధి, కాపు వీధులలో గల నివాసాలకు ఇంటింటికి కుళాయి పైప్ ద్వారా తాగునీరు అందించేందుకు ఆదివారం హైస్కూల్ ఓవర్ హెడ్ ట్యాంక్ వద్ద అభివృద్ధి పనులకు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు అధికారుల సమక్షంలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామానికి విచ్చేసినప్పుడు తాగునీటి సమస్య ఉందని గ్రామస్తులు చెప్పారన్నారు. వెంటనే సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి మొదటి ప్రాధాన్యతగా గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.40 లక్షల నిధులతో ఇంటింటికి కుళాయి పనులకు శంకుస్థాపన చేయడమే కాకుండా త్వరలోనే తాగునీరు అందిస్తామని తెలిపారు. అదేవిధంగా గ్రామం మొత్తం కూడా రెండు కోట్ల రూపాయల నిధులతో జలజీవన్ మిషన్ కార్యక్రమం ద్వారా ఇంటింటికి కుళాయి వేయించి తాగునీరు సరఫరా చేస్తామని తెలియజేశారు. ప్రజల సంక్షేమానికి, పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధిక ప్రాధాన్యమిస్తూ మీ అందరి సమస్యలు తెలుసుకుని శాశ్వత పరిష్కారం చేసి చూపాలనే ఉద్దేశంతోనే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టమని ఆదేశించారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చెరుకుబిల్లి బంగారమ్మ, వైస్ ఎంపీపీలు సిద్దా జగన్నాథరావు, బంకురు రవి కుమార్, ఎంపీపీ ప్రతినిధి మజ్జి శేఖర్, పీఏసీఎస్ చైర్మన్ కాపారపు సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు భీమవరపు కృష్ణమూర్తి, వెంపలి గురురాజు, మడక విశ్వనాథం, స్థానిక నాయకులు రెడ్డి అప్పలస్వామి, పి శేషు, బూతల వెంకటరమణ, కోట సంజీవ నాయుడు, కార్యకర్తలు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ, స్థానిక ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శవ రాజకీయానికి చంద్రబాబు తాపత్రయం

శవ రాజకీయం చేయాలని చంద్రబాబు తాపత్రయపడుతున్నాడని ఎమ్మెల్యే జోగారావు విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఆయన తన క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, వారి కార్యకర్తలు చిత్తూరు జిల్లా పుంగనూరులో పోలీసులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై చేసిన దాడిపై స్పందిస్తూ వారి చర్యను తీవ్రంగా ఖండించారు. గెలుస్తామన్న నమ్మకం ఏకోశాన లేని పార్టీలు, నాయకులు మాత్రమే హింసను ప్రేరేపించి, ప్రజల్ని రెచ్చగొడతారన్నది అందరికీ తెలిసిన విషయమేనన్నారు. ఇప్పుడు పవన్ కల్యాణ్, లోకేశ్ చేస్తున్నదీ అదేనని. వారిద్దరినీ నడిపిస్తున్న చంద్రబాబు చేస్తున్నదీ అదే అని ఆరోపించారు. పుంగనూరులో హింసను ప్రేరేపించడమే కాకుండా, లా అండ్ ఆర్డర్ సవ్యంగా నిర్వహిస్తున్న పోలీసులపై దాడి చేసి, 40 మంది రక్తం కళ్లజూశారని, బహుశా ఇటువంటి సంఘటన రాష్ట్ర చరిత్రలోనే లేదన్నారు.

గెలిచే సత్తాలేక ఈ నాటకాలు

పుంగనూరులో గెలిచే సత్తా చంద్రబాబుకు లేదని, ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎవరిని అడిగినా చెబుతారన్నారు. అంతేకాక, కుప్పంలో చంద్రబాబు గెలుస్తాడా అంటే ఈ సారి, కుప్పంలో ఉన్న టీడీపీ శ్రేణులే అది అనుమానాస్పదమే అని చెబుతున్నారన్నారు. అటువంటి పరిస్థితుల్లో చంద్రబాబు తీవ్రమైన ఒత్తిడికి గురై, పిచ్చి పట్టినట్టుగా తన మనుషుల్ని, అదికూడా వేరే నియోజకవర్గాల నుంచి తీసుకొచ్చి హింసకు ప్రేరేపించడాన్ని అత్యంత తీవ్రమైన నేరంగా పరిగణించి, తక్షణం చంద్రబాబును అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

ఓటరు జాబితా తయారీకి ఇంటింటి సర్వే



ఓటు నమోదు దరఖాస్తు స్వీకరిస్తున్న బీఎల్‌ఓ సింహాచలం

సీతానగరం: మండలంలోని అర్హులకు ఓటుహక్కు కల్పించడంతో పాటు అనర్హులకు ఓట్ల తొలగింపు నోటీసులు ఇవ్వడం, గ్రామాంతరం వెళ్లిన వారి ఓట్లు తొలగింపు కార్యక్రమాన్ని పెదభోగిలి సచివాలయ కన్వీనరు బి.సూర్యనారాయణ, వీఆర్వో(బీఎల్వో) మండంగి సింహాచలం ఆదివారం నిర్వహించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ పెదభోగిలిలో ఉన్న రెండు సచివాలయాల్లో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో అర్హులైన వారందరికీ ఓటు కల్పిస్తామని చెప్పారు. అలాగే దీర్ఘకాలం గ్రామాంతరం వెళ్లిన వారి ఓట్లు తొలగించడానికి ముందుగా కుటుంబసభ్యులకు నోటీసులు ఇచ్చిన వారం రోజుల్లో తొలగించడానికి ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకుంటారని తెలియజేశారు. అలాగే అర్హులైన వారికి ఇళ్లవద్దనే నమోదు దరఖాస్తు స్వీకరించడంతో పాటు సర్వే చేస్తామన్నారు.

ఆయుష్ మందులతోనే దీర్ఘకాలిక వ్యాధులు దూరం



బూర్జలో ఆయుర్వేద అస్పత్రి

సీతానగరం: ఆయుష్ మందులతోనే దీర్ఘకాలిక వ్యాధులు నయమవుతాయని బూర్జ ఆయుష్ వైద్యాధికారి టి.హేమాక్షి అన్నారు. ఈ మేరకు ఆదివారం బూర్జ ఆయుర్వేద ఆస్పత్రిలో ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో కీళ్లనొప్పులు, జలుబు, దగ్గు, ఉబ్బసం, పొట్ట ఉబ్బరం, సుగర్, కాళ్లుచేతుల తిమ్మిర్లు, మలబద్ధకం తదితర వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఇటీవల గ్రామాల్లో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాల్లో ఈ మేరకు గుర్తించినట్లు తెలియజేశారు. వివిధ రకాల వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న వారికి యోగా విద్యతో పాటు ఆయుర్వేద మందులు నిర్మూలనకు దోహద పడుతున్నాయని, అందుకనుగుణంగా పాఠశాలల్లో, గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి సేవలందిస్తున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో బూర్జ అయుర్వేద ఆస్పత్రిలో అన్నిరకాల వ్యాధుల నివారణకు ప్రభుత్వం మందులు సమకూర్చినట్లు తెలియజేశారు.

రేగిడి పీఏసీఎస్ చైర్మన్‌గా అశోక్

రేగిడి: స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో పీఏసీఎస్ చైర్మన్‌గా వంజరాపు అశోక్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను సొసైటీ సీఈఓ గోవిందరావు, అసిస్టెంట్ సీఈఓ కామేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు మామిడి వేణునాయుడు, వంజరాపు ఆదినారాయణ తదితరులు కలిసి అభినందనలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి, ఈ పదవి కట్టబెట్టిన ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహన్‌రావు తదితరులకు కృతజ్ఞతలని అశోక్ అన్నారు. సొసైటీని అభివృద్ధి పథంలో నడిపించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. సొసైటీ పరిధిలోని అర్హులైన రైతులందరికీ రుణాలు అందిస్తామన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా భవనాలు



పూర్తయిన రైతు భరోసా భవనం



గాదెలవలసలో ప్రారంభానికి సిద్ధంగా సచివాలయ భవనం

సీతానగరం: మండలంలోని పలుగ్రామాల్లో నిర్మించిన నూతన సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు ప్రారంభానికి సిద్ధమవుతున్నాయని మండల ఇంజనీరింగ్ అధికారి చంద్రమౌళి అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన గాదెలవలసలో సర్పంచ్ బి అన్నపూర్ణ ఆధ్వర్యంలో నిర్మితమైన సచివాలయ భవనంతో పాటు ఆర్బీకే భవనం పనులు పూర్తయిన సందర్భంగా ఇంజినీరింగ్ సహాయకుడు జగన్‌మోహన్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిడగల్లు, కాశీపేట, తామరఖండి, వెంకటాపురం, పెదంకలాం, గాదెలవలస, పెదభోగిలి 2 గ్రామాల్లో సచివాలయ భవనాలు పూర్తి కావడంతో ప్రారంభించడానికి సిద్ధం చేశామని తెలియజేశారు. అలాగే గాదెలవలసలో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, సచివాలయం పనులు పూర్తయ్యాయని, త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. గెడ్డలుప్పి, చినభోగిలి, గుచ్చిమి, సూరంపేట, ఆర్ వెంకంపేట, జానుమల్లువలస బగ్గందొరవలస గ్రామాల్లో సచివాలయ భవనాలు పూర్తి కావచ్చాయన్నారు. పణుకుపేటలో యూనానిమస్ గ్రాంట్స్ కింద మంజూరుచేసిన నిధులతో సీసీ రోడ్డు కాలువ, కల్వర్టు పనులు జరుగుతున్నాయని తెలియజేశారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంబాల జోగులు పక్కనే ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

రాజాం సిటీ: అధికారులంతా సమన్వయంతో పని చేసి, అభివృద్ధి పనుల పూర్తిపై దృష్టిసారించాలని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సూచించారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లావేటి సులోచన అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ హాజరయ్యారు. శివారు భూములకు తోటపల్లి నీరు అందజేయడంలో అధికారులు ఎందుకు తాత్సారం చేస్తున్నారని, సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్లు గ్రామాల్లోని సమస్యలు ఎందుకు పరిష్కరించడం లేదని కొంతమంది సభ్యులు నిలదీయగా, స్పందించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ప్రజాసమస్యల పరిష్కారంలో, అభివృద్ధి పనులను వేగవంతం చేయడంలో నిర్లక్ష్యం వహించడం తగదని, అధికారులపై మండిపడ్డారు. విధుల నిర్వహణలో అలసత్వం వహించవద్దన్నారు. సచివాలయానికి ఓ ఎనర్జీ అసిస్టెంట్ ఉన్నప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏంటన్నారు. గత సమావేశంలో కూడా ఇదే విషయమై ఫిర్యాదులు అందాయని, అయినప్పటికీ మార్పు రాలేదని మండిపడ్డారు. మరోసారి ఫిర్యాదులు అందితే సహించేది లేదని హెచ్చరించారు. అలాగే పశు సంవర్థక శాఖ అసిస్టెంట్లు పాడిరైతులకు అందుబాటులో ఉండాలని, ఆర్‌బీకేలకు వచ్చిన మందులను రైతులకు అందజేయాలని సూచించారు. ఇరిగేషన్ అధికారులు ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి, తోటపల్లి కాలువ ద్వారా శివారు భూములకు సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలందరికీ అందుబాటులో అధికారులు ఉండి, వారి సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. పాఠశాలల్లో నాడు-నేడు పనులు పక్కాగా నిర్వహించడంతో పాటు మధ్యాహ్న భోజన పథకం మెనూ ప్రకారం అమలయ్యేలా చూడాలన్నారు. గ్రామాల్లోని అభివృద్ధి పనులను త్వరితగతిన చేపట్టేలా అధికారుల పర్యవేక్షణ ఉండాలన్నారు. ఎటువంటి సమస్యలపైన అయినా మరోసారి జరిగే సమావేశంలో పునరావృతం కాకుండా చూసుకోవాలని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బండి నర్సింహులు, వైస్ ఎంపీపీలు యాలాల సునీత, నక్క వర్షిణి, మండల కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముళ్ల చిన్నారావు, తహసీల్దార్ ఎస్‌కే రాజు, ఎంపీడీఓ బాసూరి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.


వైద్యసేవ నారాయణ సేవతో సమానం



వైద్య శిబిరం సందర్శనలో మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణారావు

బొబ్బిలి: వైద్యసేవ నారాయణుడి సేవతో సమానమని మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు అన్నారు. ఆదివారం స్థానిక పట్టణంలోని 16వ వార్డులో కౌన్సిలర్ ఎస్.బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని పరిశీలించిన ఆయన ప్రతి ఒక్కరూ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని, ఆరోగ్య తనిఖీలు చేసుకోవాలని తెలిపారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని, వాటి బారినపడకుండా జాగ్రత్త వహించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. శిబిరానికి హాజరైన 250 మందికి వైద్య సిబ్బంది ఆరోగ్య తనిఖీలు చేపట్టి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, జేసీఎస్ పట్టణ ఇన్‌చార్జ్ రేజేటి ఈశ్వరరావు(విసు), మున్సిపల్ కౌన్సిలర్లు పాలవలస ఉమాశంకర్, వాడపల్లి వనజామనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

10 నుంచి నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ



ఆరోగ్య తనిఖీలు చేస్తున్న వైద్యాధికారి దిలీప్‌కుమార్

రామభద్రపురం: నులిపురుగు నివారణ దినోత్సవం సందర్భంగా ఈ నెల 10వ తేదీ నుంచి నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ చేస్తున్నట్లు వైద్యాధికారులు దిలీప్‌కుమార్, శిరీష తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించి, పలువురికి ఆరోగ్య తనిఖీలు చేపట్టి, ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలలు, రామమందిరాల వద్ద 2 నుంచి 19 ఏళ్ల వయసు వారికి నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. ఆరికతోట పీహెచ్‌సీ పరిధిలో 3,600 మంది, రామభద్రపురం పీహెచ్‌సీ పరిధిలో 3,063 మందికి మాత్రలు వేయనున్నామన్నారు. చిన్నారుల్లో నెలకొనే నులిపురుగుల సమస్య కలుషితమైన ఆహారం తీసుకోవడం వల్ల వస్తుంద, పరిశుభ్రమైన మంచి ఆహారం పిల్లలకు పెట్టాలని తెలిపారు. రెండేళ్ల వయసు కలిగిన పిల్లలు 200 ఎంజీ, మిగిలిన వారు 400 ఎంజీ మాత్రలు వేసుకోవాలన్నారు.

సామాజిక తనిఖీలు పారదర్శకంగా చేపట్టాలి



గ్రామసభలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ జంపు కన్నతల్లి

వీరఘట్టం: సామాజిక తనిఖీలను పారదర్శకంగా నిర్వహించాలని జెడ్పీటీసీ జంపు కన్నతల్లి అన్నారు. కత్తులకవిటిలో సామాజిక తనిఖీల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన గ్రామసభలో ఆమె మాట్లాడారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో గ్రామంలో రూ.1.29 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. అనంతరం గ్రామంలోని ఆర్‌బీకే వద్ద రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. ఖరీఫ్‌లో రైతుల అవసరాలకు తగిన ఎరువులను ప్రభుత్వం ఆర్‌బీకేల్లో సిద్ధం చేసిందన్నారు. రైతులు ఎరువుల కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సర్పంచ్ గేదెల సరోజనమ్మ, ఎంపీటీసీ కొత్తవలస పరిమల, ఎస్‌ఆర్‌పీ గోవిందరావు, డీఆర్‌పీ జె.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

సీతంపేట: ప్రస్తుత సీజన్‌లో మూగజీవాలకు వ్యాధులు ప్రబలకుండా టీకాలు వేస్తున్నామని పశు సంవర్థకశాఖ ఏడీ శ్రీనివాసరావు, పశువైద్యాధికారి ఆర్.శంకరరావు తెలిపారు. పాడిరైతులు తమ వద్ద ఉన్న పశువులకు టీకాలు తప్పకుండా వేయించాలని సూచించారు. పశువ్యాధుల పట్ల పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలని, వ్యాధి లక్షణాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

ఘనంగా వారాల పండగ

బాడంగి: మండలంలోని ముగడ గ్రామంలో వారాల పండగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత గ్రామ పూజారి మత్స సింహాచలంను గ్రామ వీధుల్లో ఊరేగించి, ఆయనతో ఇళ్లపై అక్షింతలు జల్లించారు. అనంతరం గ్రామ శివారులోని పెద్దచెరువు గట్టు వద్దకు భక్తులు వెళ్లి, అక్కడ కొలువైన దేశమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేశారు. పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఏడాది పంటలు బాగా పండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో మెలగాలని కోరుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజాం సిటీ: స్థానిక పాలకొండ రోడ్డులో సోమవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ కుమార్ ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. రోడ్డు విస్తరణలో భాగంగా కొత్త స్తంభాల ఏర్పాటుతో పాటు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను మార్పు చేయనున్నామన్నారు. ఈ నేపథ్యంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మోర్ జంక్షన్ నుంచి ఈశ్వరనారాయణ కాలనీ, బాబానగర్ కాలనీలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ అంతరాయానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం

రాజాం సిటీ: స్థానిక పట్టణంలో ఓల్డ్ ఫ్రెండ్స్ అసోసియేషన్, స్నేహం అసోసియేషన్ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్‌ల సభ్యులు కేక్ కట్ చేసి, ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుని, ఆనందంగా గడిపారు. ఓల్డ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఈ ఏడాది చేపట్టనున్న సేవా కార్యక్రమాలపై ఆ సంస్థ అధ్యక్షుడు, బీవీ అచ్యుత్‌కుమార్ చర్చించారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేష్టం



రేగిడి: చాటాయవలసలో జరిగిన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు

రేగిడి: తల్లిపాలు బిడ్డకు శ్రేష్టమైనవని ఐసీడీఎస్ బూరాడ సెక్టార్ సూపర్‌వైజర్ సీహెచ్ నూకాలమ్మ అన్నారు. ఆదివారం మండలంలోని చాటాయవలస, వండానపేట గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్న ఆయన అప్పుడే పుట్టిన బిడ్డకు కొన్నాళ్లపాటు తల్లిపాలు ఇవ్వాలని, ఇలా చేయడం ద్వారా శిశువులో రోగనిరోధక శక్తి పెరిగి, శిశు మరణాలు జరగకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కరణం గోవిందరావు, ఎంపీటీసీ పి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: స్థానిక మల్లంపేటలోని 22, 23వ వార్డుల్లో తల్లిపాల వారోత్సవాలు ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఐసీడీఎస్ పీఓ విజయలక్ష్మి తల్లిపాల ఆవశ్యకతను వివరించారు.

వినూత్నంగా వరినాట్లు



బొమ్మిక వద్ద వరినాట్లు వేస్తున్న బెంగాలీ కూలీలు

భామిని: సాగులో ఆధునిక యాంత్రీకరణ పద్ధతులు అనుసరించడం ద్వారా కూలీల కొరతతో పాటు సమయం, ఖర్చు ఆదా అవుతుంది. అయితే గోదావరి జిల్లాల నుంచి వచ్చిన కొందరు బెంగాలీ కూలీలు యంత్రాలకు దీటుగా సంప్రదాయ లైన్ పద్ధతిలో తక్కువ సమయంలో ఎక్కు విస్తీర్ణంలో వరినాట్లు వేస్తూ ఔరా అనిపిస్తున్నారు. ఎకరంలో సాధారణంగా వేసే వరినారులో మూడో వంతు నారుతో నార్లు పూర్తిచేస్తున్నారు. తాడుసాయంతో ఒక క్రమపద్ధతిలో నిర్ణీత దూరంలో నాట్లు వేస్తూ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. 12 మంది బృందం రోజుకు ఐదు ఎకరాల్లో నారుతీత, నాట్లు వేయడం పూర్తి చేస్తున్నారు. స్థానిక కూలీలతో వరినాట్లు వేయిస్తే ఎకరానికి రూ.6800 వరకు ఖర్చు కాగా.. వీళ్ల ఎకరానికి రూ.4200 చొప్పున తీసుకుంటున్నారు. సాధారణంగా ఎకరాకు సుమారు రెండు వందల నారుకట్టలు అవసరం కాగా.. బెంగాలీ కూలీలు 60 నారుకట్టలతో నాట్లు పూర్తిచేస్తున్నారు. దీని వల్ల ఎకరాకు 10 కిలోల విత్తనాలు సరిపోతాయని, దూరం దూరంగా నాట్లు వేయడం వల్ల మొక్క మొదళ్లకు గాలి, వెలుతురు పుష్కలంగా తగలడంతో దుబ్బు బాగా చేసి పంట దిగుబడి కూడా పెరుగుతుందని అంటున్నారు.

